

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీలకు పరిష్కారం చూపాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 22: ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ 'మీ కోసం'లో వచ్చిన అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్‌తో కలిసి 'మీ కోసం' కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి.. తమ సమస్యల పరిష్కారం కోరుతూ 151 మంది అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయంలోగా అర్జీలను పరిష్కరించాలని, ప్రతీ అర్జీని అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి 'ఆధార్' శిబిరాలు

ఆధార్ ప్రత్యేక శిబిరాలను అందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. 'ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తాం. ఇందులో 0-5 ఏళ్లలోపు పిల్లలకు "బాల ఆధార్" నమోదు చేయాలి. 5-7 ఏళ్లు, 15-17 ఏళ్లవారు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలి. గత పదేళ్లలో ఆధార్ కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీల్లో ఎటువంటి మార్పులు, చేర్పులు చేయని వారు ఒరిజినల్ గుర్తింపు ధ్రువపత్రంతో ఆధార్ శిబిరంలో అప్‌డేట్ చేసుకోవాలి' అని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఉప కలెక్టర్ సుదర్శనదొర, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డీసీహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

వైద్యుల్లేరు.. మందుల్లేవు

- ప్రాథమిక చికిత్సలకే పరిమితం
- అత్యవసర కేసులు శ్రీకాకుళం రెఫర్
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వైనం
- ఇదీ టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి దుస్థితి
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పేరుకే టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి. సేవలు మాత్రం ఆ స్థాయిలో ఉండవు. కూర్చొనేందుకు కుర్చీలు ఉండవు. తాగేందుకు నీరు ఉండదు. పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండరు. అవసరమైన మందులు దొరకవు. కేవలం ప్రాథమిక వైద్యమే అందిస్తారు. అత్యవసర కేసులను శ్రీకాకుళం జీజీహెచ్(రిమ్స్)కు రెఫర్ చేస్తుంటారు. అందుకే రెఫరల్ ఆస్పత్రిగా పేరుపొందింది. ఇలా ఎన్నో సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ ఆసుపత్రిని గాలికొదిలేసింది. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా జిల్లాకేంద్రాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

(టెక్కలి)

టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో సక్రమంగా వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.30కోట్లతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. 2019లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దీన్ని ప్రారంభించారు. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి, సారవకోట, పాతపట్నం, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల నుంచి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో 800కు పైగా పేర్లు నమోదవుతాయి. ఇన్ పేషెంట్స్, ఆరోగ్యశ్రీ కింద మరికొంతమంది చికిత్స పొందుతుంటారు. దీంతో నిత్యం రోగులతో ఆస్పత్రి కిటకిటలాడుతుంది. అయితే, వైద్య సిబ్బంది కొరతతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. సివిల్ సర్జన్లకు సంబంధించి డెర్మటాలజీ వైద్యుడు ఏడాదిన్నర కిందట విధుల్లో చేరారు. కొద్దిరోజులు మాత్రమే ఆయన పని చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు సంబంధించి జనరల్ సర్జన్, రేడియాలజీ, ఎనస్థీషియా వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా 17 స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీ. తాత్కాలికంగా ట్రైనీ నర్సింగ్ సిబ్బంది 14 మంది ఉన్నా వీరంతా ఈ నెలాఖరుకి రిలీవ్ కానున్నారు. దీంతో స్టాఫ్‌నర్స్ కొరత మరింతగా వేధించనుంది. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు ప్రతిపాదనతో ఓ స్టాఫ్‌నర్సు పలాస డెప్యుటేషన్‌పై వెళ్లిపోయింది. గ్రేడ్-1 ఫార్మాసిస్ట్ పోస్టు, ఎక్స్‌రే విభాగాల పోస్టులు కొన్ని ఖాళీగా ఉన్నాయి.

- ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం తదితర 14 మండలాల నుంచి హెచ్ఐవీ బాధితులతో పాటు కిడ్నీ, టీబీ, లీవర్ వంటి వ్యాధిగ్రస్తులు తమ మందుల కిట్లు తీసుకునేందుకు ప్రతి నెల టెక్కలి ఆసుపత్రికి వస్తుంటారు. అయితే, వీరికి మందులు ఇచ్చే ఫార్మాసిస్ట్ పోస్టు ఖాళీగా ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ఆసుపత్రికి ప్రతి మూడునెలలకు ఒకసారి రూ.13.50లక్షలు విలువచేసే మందులు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి వస్తుంటాయి. రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ఆ మందులు సరిపోవడం లేదు. దీంతో డీ సెంట్రలైజ్డ్ బడ్జెట్ కింద 30 శాతం మందులు కొనుగోలు చేస్తున్నారు. అయినా అవసరమైన మందుల కొరత ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని డైరెక్టరీ ఆఫ్ సెకెండరీ హెల్త్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం కానరావడం లేదు.

మరుగునపడిన ట్రామాకేర్ సేవలు

టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రి పరిధిలో సుమారు 50 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. దీంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు ట్రామాకేర్ సెంటర్‌కు వస్తుంటారు. అయితే, ఇక్కడ వైద్య సిబ్బంది కొరతతో క్షతగాత్రులను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. మొత్తం 40 పోస్టులకుగాను 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మూడు క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్స్ పోస్టులు, పది స్టాఫ్‌నర్సు, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఐదు ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, మూడు రేడియోగ్రాఫర్లు, రెండు ఈసీజీ టెక్నీషియన్స్, మూడు అంబులెన్స్ డ్రైవర్స్, ఒక మేన్‌ఫోల్డ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ట్రామాకేర్ సేవలు మరుగునపడ్డాయి.

మరికొన్ని సమస్యలు..

- వేసవిలో నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. ఆసుపత్రికి అర కిలోమీటరు దూరంలో ఉన్న ఓ బోరు నుంచి అరకొరగా నీరు సరఫరా జరుగుతుంది. దీంతో మరుగుదొడ్ల వద్ద రోగులు, రోగుల సహాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉన్న ఒక్క బోరు కూడా మొరాయిస్తే రోగుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.
- ఇక్కడ మార్చురీ గది సౌకర్యం లేదు. పాత జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చురీనే ప్రస్తుతం వినియోగిస్తున్నారు. మృతదేహాలను అక్కడకు తరలించాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో మృతుల కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి.
- రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు అవసరమైన బెంచీలు, కుర్చీలు లేవు. దీంతో వారు ఒక్కోసారి నేలపైనే కూర్చొంటున్నారు.
- వ్యర్థాలు, మురికినీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో ఆసుపత్రి వెనుక భాగంలో నిలిచిపోతున్నాయి. దీనివల్ల ఆ ప్రాంతం కంపుకొడుతుంది.
- వైద్యులు, సిబ్బంది వాడిన సామగ్రిని ఉంచేందుకు బయోమెడికల్ రూమ్ సౌకర్యం లేకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు.
- పాత జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 2016లో ఆర్వో ప్లాంట్‌ను అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఏర్పాటు చేశారు. 2019లో నిర్మించిన కొత్త ఆసుపత్రికి ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో రోగులకు తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది.
- దాతలు ఇచ్చిన ఒకటి, రెండు వీల్ ఛైర్లు, స్ట్రెచర్లతోనే కాలం నెట్టుకొస్తున్నారు. కొత్తవాటిని కొనుగోలు చేయలేదు.
- పలు విభాగాల్లో ఫ్యాన్లు లేవు. కొన్నిచోట్ల ఉన్నా తిరగడం లేదు. కరెంట్ పోతే జనరేటర్‌ను వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. గంటకు ఎనిమిది లీటర్ల డీజిల్ కాలుతుందని జనరేటర్ వినియోగంలో నాన్చుడి ధోరణి అవలంభిస్తున్నారు.

మెరుగైన సేవలకు కృషి చేస్తాం

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తాం. వైద్యులు, సిబ్బంది కొరత విషయాన్ని జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైన మందుల బడ్జెట్ కోసం డైరెక్టరీ ఆఫ్ సెకెండరీ హెల్త్ దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశం నిర్వహించనున్నాం. ఛైర్మన్‌గా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధికారులు సమావేశానికి హాజరై ఆసుపత్రి అభివృద్ధిపై పలు తీర్మానాలు చేయనున్నారు.

- బి.సూర్యారావు, సూపరింటెండెంట్, జిల్లా కేంద్రాసుపత్రి, టెక్కలి

భూమిని కాజేస్తున్నారని..

- రౌడీషీటర్ బెదిరింపులపై ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, జూలై 22: తమ భూమిని కాజేసేందుకు ఓ రౌడీషీటర్, మరికొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారని రిటైర్డ్ ఏఎస్ఐ భార్య సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి వివరాల మేరకు.. పెద్దపాడు గ్రామానికి చెందిన లండ సూరమ్మకు పెళ్లి సమయంలో కట్న కానుక కింద కన్నవారు 22.5 సెంట్ల భూమి ఇచ్చారు. ఆమె భర్త ఏఎస్ఐ అప్పలనాయుడు ఉద్యోగ విరమణ సమయంలో అందిన డబ్బులతో ఆ భూమి పక్కనే మరో 22.5 సెంట్లు కొనుగోలు చేశారు. రిటైర్డ్ ఏఎస్ఐ అప్పలనాయుడు కొన్నాళ్ల కిందట మృతి చెందగా.. సూరమ్మ ప్రస్తుతం విశాఖపట్నంలోని తమ కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. కాగా.. పెద్దపాడులో తన భూమిని కొంతమంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తెలుసుకుని.. ఇటీవల గ్రామానికి వచ్చారు. దీనిపై సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. 'కలగ నర్సింగ్ అలియాస్ పాపి అనే రౌడీషీటర్, ఆయన సోదరుడు, మరికొంతమంది మా భూమిలో మమ్మల్ని పని చేసుకోనీయకుండా అడ్డుకుంటున్నారు. ఇళ్లపై దాడులు చేస్తున్నారు. దీనిపై గతంలో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. బెదిరింపులు ఆగడం లేదు' అని ఆమె ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై పరిశీలించి.. ఆమెకు రక్షణ కల్పించాలని ఎస్ఐకి ఎస్పీ మహేశ్వరరెడ్డి ఫోన్‌లో ఆదేశించారు.



ఫిర్యాదు దారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

'మీ కోసం'లో 55 వినతులు..

ప్రజా పరిష్కార వేదికైన 'మీకోసం' కార్యక్రమంలో 55 వినతులు వచ్చాయి. వీటిలో కుటుంబ తగాదాలకు సంబంధించి 8, మోసపూరితమైనవి 3, పౌర సంబంధాలపై 16, దొంగతనాలపై 5, పాత ఫిర్యాదులపై 12, ఇతర తగాదాలకు సంబంధించి 11 వినతులు ఉన్నాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డా.జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు.. కాలువలు ఏవీ?

- అధ్వానంగా జగనన్న కాలనీలు
- వర్షాలకు చిత్తడిగా మారిన వైనం
- గత ఐదేళ్లలో వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- లబ్ధిదారులకు తప్పని అవస్థలు

(ఇచ్ఛాపురం)

వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన జగనన్న కాలనీలు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారాయి. కనీస వసతులు కల్పించడంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గృహ నిర్మాణాలు చేపట్టలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీలోని ఏడు లేఅవుట్లలో 1,625మంది లబ్ధిదారులకు నివాస స్థలాలతోపాటు పక్కా గృహాలను గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. పాతాళ సిద్ధేశ్వర ఆలయం వద్ద 3, రత్తకన్నలో 2, పురుషోత్తపురం, ఏఎస్‌పేటలో ఒక్కోటి చొప్పున లేఅవుట్ వేశారు. మునిసిపాలిటీలో వేలల్లో లబ్ధిదారులు ఉండగా.. పట్టణ సమీపంలో స్థలాలు అందుబాటులో లేవు. దీంతో పట్టణానికి దూరంలో ఉన్న పాతాళసిద్ధేశ్వర, రత్తకన్న కొండ సమీపంలో జగనన్న కాలనీలకు స్థలాలు కేటాయించారు. ఈమేరకు కొంతమంది లబ్ధిదారులు గృహాల నిర్మాణాలు చేపట్టారు. కాగా.. కాలనీలో రహదారులు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా.. ఎక్కడికక్కడ గోతుల్లో నీరు నిలిచిపోయి.. రహదారి అంతా బురదమయం కావడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. భవనాల నిర్మాణానికి సంబంధించి సామగ్రి తెచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల పూర్తయిన తర్వాత కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. కాగా.. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందడంతో జగనన్న కాలనీల్లో అభివృద్ధి ఉత్తిమాటగానే మిగిలింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. ఈ కాలనీల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



పాతాళసిద్ధేశ్వర ఆలయ సమీపంలోని జగన్న కాలనీ రోడ్లు ఇలా..



పంట కాదు..

ఈ చిత్రంలో కనిపిస్తున్న పచ్చని మొక్కలు ఏదో పంట అనుకుంటే పొరపాటే. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ ఎగువ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిపై తేలియాడుతున్న గుర్రపు డెక్క ఇది. కొన్నిరోజులుగా ఎగువ ప్రాంతం నుంచి వర్షం నీటితో పాటు గుర్రపుడెక్క వచ్చి బ్యారేజి గేట్ల వద్ద నిలిచిపోయింది. దీంతో ఇలా పచ్చని తివాచీలా కనిపిస్తోంది. గుర్రపు డెక్క బ్యారేజీ గేట్ల వద్ద నిలిచిపోవడంతో కుడి,ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి దీనిని తొలగించాలని కోరుతున్నారు.

- హిరమండలం

గ్రామీణ రహదారులకు మహర్దశ

- మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- ప్రతిపాదనలు పంపాలని పీఆర్ ఇంజనీర్లకు ఆదేశం



మెళియాపుట్టి మండలం సంతలక్ష్మీపురం రహదారి ఇది. సంతలక్ష్మీపురం నుంచి గంగన్నపేట వరకు ఈ రహదారి నిర్మాణానికి ఐదేళ్ల కిందట రూ.2.65 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వైసీపీ పాలనలో అవిగో.. ఇవిగో నిధులు అంటూ కాలయాపన చేశారు. పనులు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిసినా.. రోడ్డు బురదమయమై.. వాహనదారులు నరకయాతన పడుతున్నారు. పలాస- మెళియాపుట్టికి ఇది అనుసంధానం రహదారి కావడంతో నిత్యం వాహనాలు రద్దీ అధికంగా ఉంటుంది. కాగా.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోయినా.. కూటమి అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే.. ఈ రహదారి మరమ్మతులపై దృష్టి సారించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మెళియాపుట్టి మండలం రింపి గ్రామ రహదారి ఇది. నేలబొంతు నుంచి రింపి గ్రామ రహదారి పనుల కోసం గత ప్రభుత్వం రూ.1.90 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. కానీ నిధులు మంజూరు చేయక.. పనులు చేపట్టలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించడంతో.. మళ్లీ కదలిక వచ్చింది.

(మెళియాపుట్టి)

వైసీపీ పాలనలో రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ఎక్కడ చూసినా గోతులమయమే. గత ఐదేళ్లలో నిధులు మంజూరు చేయకపోవడంతో కనీసస్థాయిలో కూడా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రయాణికులు నరకయాతన పడుతూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోగా.. స్థానికులు స్వచ్ఛందంగా చందాలు వేసుకుని రోడ్డు బాగు చేద్దామనుకున్నా.. కేసుల నమోదుతో వేధింపులు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో మరింత ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించింది. ఇటీవల డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రహదారులు మెరుగుపడనున్నాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 312 రహదారుల పనులకు (484.43 కిలోమీటర్లు) రూ.352.78కోట్లతో అంచనాలు రూపొందించింది. ఏఐఐబీ-1 నిధుల కింద నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. ఇందులో 266 పనులు మాత్రమే ప్రారంభించి రూ.66.59 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పనులు వివిధ దశల్లో ఉన్నట్టు వెల్లడించారు. దీంతోపాటు ఆర్‌సీపీఎల్ డబ్ల్యుఈ కింద 23 రహదారుల పనులకు (9,460 కిలోమీటర్లు) రూ.7,096కోట్లతో అంచనాలు రూపొందించారు. 22 రోడ్డు పనులు మాత్రమే పూర్తిచేసి రూ.55.55కోట్లు ఖర్చు చేశారు. అలాగే పీఎంజీఎస్‌వై ఫేజ్-3 పథకం ద్వారా 11 రోడ్లులకు (82.70 కిలోమీటర్లు పొడవునా) రూ.51.27 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఈ ఐదేళ్ల నిధులు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నా.. రహదారులు మాత్రం ఎక్కడికక్కడే గుంతలే కనిపిస్తున్నాయి.

నిధులు లేక నిలిచిన పనులు

వైసీపీ పాలనలో రహదారులు నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాలేదు. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. ఈ క్రమంలో కొంతమంది వైసీపీ నాయకులే టెండర్లు వేసిన పరిస్థితి ఎదురైంది. ఏఐఐబీ-1(బీ) పథకంలో 83 రహ దారుల పనులుకు (205.68 కిలోమీటర్లు) రూ.46.92 కోట్లు అంచనాలతో టెండర్లుకు పిలిచినా ఎవరు ముందుకురాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఏఎంసీ నిధులుతో 81 పనులకు గాను (170.76 కిలోమీటర్లు) రూ.37.76 కోట్లతో 13 ప్యాకేజీలు టెండర్లు పిలవగా.. ఇవికూడా అగ్రిమెంటుతో నిలిచిపోయాయి.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం

గతంలో అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచినా పనులు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు.. అత్యవసర రహదారుల పనులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం.

- నాగేశ్వరరావు, పీఆర్ ప్రాజెక్టు ఇంజనీర్, పాతపట్నం

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి



ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.

రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విధానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే.. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని ఆర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా వన్ ప్లస్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరిగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్‌ఎస్‌ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్థమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండకూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి

వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాధలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదు సంవత్సరాల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లున్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

అమ్మకాల వెల్లువ

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్ మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది.



ఆహార ధరలపై వాతావరణ ప్రభావం

గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడిగాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.

ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ★ ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- ★ హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ★ ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- ★ భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- ★ జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ★ ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రభుత్వం దృష్టికి పంటల నష్టం వివరాలు

● వ్యవసాయ శాఖ ఏడీ రాజగోపాల్

తురకపేట(ఎల్.ఎన్.పేట): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట ముంపునకు గురై నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ బి.రాజగోపాల్ తెలిపారు. తురకపేట, దబ్బపాడు, కోవిలాం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ఎదలు నష్ట పోయిన రైతులు మళ్లీ పంట వేసుకొనేందుకు అనువైన తేలికరకాల వరి విత్తనాలను సబ్సిడీపై అందించడం జరుగుతుందన్నారు. రైతులు జె.మోహనరావు, ఎం.లక్ష్మణరావు, పి.సీతారాం తదితరులు మాట్లాడుతూ.. ఇప్పుడు రాయితీపై విత్తనాలు ఇచ్చినా ప్రయోజనం లేదని, వర్షాకాలమంతా పొలాల్లో నీరు తరగదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరి హారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.మధు, జి.చిట్టిబాబు, ఎస్.నీలవేణి, వ్యవ సాయాధి కారి పి. లతాశ్రీ, పలువురు రైతులు పాల్గొన్నారు.


పంట నష్టంపై ఏడీఏ రాజగోపాల్‌కు వివరిస్తున్న తురకపేట రైతులు

త్వరితగతిన నీటిని బయటకు తీయాలి

జలుమూరు: అప్పుడే వెదజల్లిన నారుమడిలో వర్షాలకు నీరు చేరితే వీలైనంత త్వరగా బయటకు పంపించాలని రాగోలు వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త పి.ఉదయబాబు తెలిపారు. అచ్యుతాపురం వద్ద వర్షపు నీటికి ముంపునకు గురైన నారుమడులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారు మడిలోరి నీటిని బయటకు పంపించి 5 సెంట్లు నారు మడికి కిలో యూరియా, కిలో పొటాష్ జల్లాలని సూచించారు. అలాగే గ్రాము కార్బండిజం పిచికారీ చేయాలన్నారు. ఆయనతో పాటు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, ఏడీఏలు రవీంద్రభారతి, వెంకటరావు, వ్యవసాయాధికారి కె.సురేష్, రైతులు పాల్గొన్నారు.


నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నేడు పాతపట్నం నీలమణిదుర్గ ఆవేటి వారోత్సవాలు

పాతపట్నం: పాతపట్నం శ్రీనీలమణి దుర్గ ఆవేటి వారోత్సవాలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఘటోత్సవాల నిర్వహణకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. వీధులను మామిడి, వేపతోరణాలతో పాటు రంగు రంగుల పేపర్ తోరణాలను కడుతున్నారు. ఘటాలు, పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్‌లో సందడి నెలకొంది. అలాగే ఆలయాన్ని విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరించారు.

26న శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీల లెక్కింపు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను ఈనెల 26న లెక్కిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అర్చకులు, పెద్దలు సమక్షంలో లెక్కిస్తున్నామన్నారు. గ్రామపెద్దలు భక్తులు పాల్గొనవచ్చన్నారు.

'మీకోసం' కార్యక్రమానికి అధికారుల డుమ్మా

మందస: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మీకోసం కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్ ఎల్.తిరుమలరావు, ఎంపీడీవో రఘుపతిరావు, ఏపీవో హరికృష్ణ, హౌసింగ్ ఏఈ రామ్మోహన్, డీటీ కృష్ణమూర్తి పాల్గొనగా మిగిలిన శాఖాధికారులు గైర్హాజరయ్యారు. వారి స్థానంలో కిందిస్థాయి సిబ్బందిని పంపడంపై విమర్శలు వినిపించాయి.

సచివాలయం-3లో నేటినుంచి ఆధార్ సేవలు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని సచివాలయం-3లో మంగళవారం నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు 100 సర్వీసులయ్యేలా గ్రామ కార్యదర్శులు ఆయా పంచాయతీల పరిధిలో దండోరా ద్వారా ప్రజలకు తెలియపరచాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిస్టరీ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ పోస్టు భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 24వ తేదీన ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. పీజీ హిస్టరీ చేసి ఉండాలని, కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, స్లెట్/ఏపిసెట్/నెట్‌లో అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం రూ.8 వేలు కళాశాల అభివృద్ధి నిధుల నుంచి ఇవ్వనున్నామని తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

టెక్కలి: స్థానిక జగతిమెట్ట జంక్షన్ సమీపంలో టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చించివేశారు. దీంతో టీడీపీ శ్రేణులు సోమ వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ షైడయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేవలం ఓర్వలేకనే కొందరు ఇలా ఫ్లెక్సీలు చించివేస్తున్నారని టీడీపీ కార్యకర్తలు అంటున్నారు.



పంచాయతీ కార్యదర్శిపై విచారణ

హరిపురం: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లోహరిబంద పంచాయతీ కార్యదర్శి ఎం.సతీష్‌బాబుపై ఎంపీడీవో రఘుపతిరావు సోమవారం విచారణ చేపట్టారు. డీఎల్పీవో ఆదేశాల మేరకు ఇది వరకు విచారణ చేపట్టగా నిందితుడి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మరో మారు విచారించారు. శ్రీకాకుళం, కవిటి, పలాస నుంచి వచ్చిన పలువురు బాధితుల నుంచి సమాచారం సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.


పంచాయతీ కార్యదర్శిని విచారిస్తున్న ఎంపీడీవో

ప్రభుత్వ ఐటీఐని మంజూరు చేయాలి

కొత్తూరు/పాతపట్నం: పాతపట్నానికి ప్రభుత్వ ఐటీఐని మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబాటుకు గురైన పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలన్నారు. ఐటీఐ ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి తదితరులున్నారు.



రాష్ట్రస్థాయి సంబరాల్లా.. కొత్తమ్మతల్లి ఉత్సవం

● దేవదాయ శాఖ కమిషనర్‌కు మంత్రి అచ్చెన్న ఆదేశం

(టెక్కలి)

ఉత్తరాంధ్ర ఇలవేల్పు కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్రస్థాయి సంబరాల్లా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు 1, 2, 3 తేదీలు (ప్రతి ఏటా దసరాకు ముందు మహాలయ అమావాస్య రోజుల్లో మంగళ, బుధ, గురువారాలు) ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. అయితే గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ ఉత్సవాల నిర్వహణపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. వైసీపీలో గ్రూపుల మూలంగా ఉత్సవాల్లో ఈవో స్థాయి అధికారిపై దాడి చేసి గందరగోళం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉత్సవాలను రాష్ట్రస్థాయి ఉత్సవాల్లా నిర్వహించాలని దేవదాయశాఖ కమిషనర్ సత్య నారాయణకు మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ఆదేశించడంతో ఈ ఏడాది ఉత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టేందుకు డీసీ, ఏసీ స్థాయి అధికారులు ప్రణాళిక రచనలకు సిద్ధమవుతున్నారు.

చేపట్టాల్సిన పనులివే..

దేవదాయశాఖ పరిధి 6ఏ జాబితాలో కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఏటా సుమారు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ఈ దేవాలయానికి సంబం ధించి కొత్తపేట, కోటబొమ్మాళి శివారు ప్రాంతాల్లో భారీ ముఖద్వారాల నిర్మాణం, పక్కా క్యూలైన్ల ఏర్పాటు, మండపాలు ఎత్తు చేయడం, అన్నదానం, కల్యాణ మండపాల నిర్మాణం, కార్యాలయం, గెస్ట్‌రూమ్‌లు, సోలార్ విద్యుత్ సౌకర్యం తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మూడు రోజుల పాటు జరిగే కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలను నిర్వహించడం ఆనవాయితీ. పండగ నేపథ్యంలో విద్యుద్దీపాలతో అలంకరించడం తదితర కార్యక్రమాలను టీడీపీ నేతలు చేపట్టేవారు. అయితే గడచిన ఐదేళ్లలో ఉత్సవాలు నీరుగారాయన్నది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు సొంత మండలంలో నిర్వహించే ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.


కొత్తమ్మతల్లి ఆలయం(ఇన్‌సెట్‌లో) అమ్మవారు

బీసీ గురుకులం తనిఖీ

● భవనాల స్థితిగతులపై ఆర్డీవో ఆరా

వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలను సోమవారం పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయక్ తనిఖీ చేశారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు కారుతున్నాయని రెండు రోజుల కిందట ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి, కమిటీ చైర్మన్ రూప ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీషకు విన్నవించి వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో భరత్‌నాయక్ తహసీల్దార్ సురేష్‌తో కలిసి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, స్టోర్‌రూంలను పరిశీలించారు. తరగతి, వసతి సమస్యలున్నట్లు గుర్తించామని, దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. పాఠశాల సమస్యలు, వసతి సదుపాయాలపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కుమారి, అధ్యాపకురాలు ఉషా, కమిటీ చైర్మన్ రూపలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అదనపు గదులు కేటాయించాలని స్థానిక టీడీపీ నేత సూరాడ మోహనరావు ఆర్డీవోను కోరగా గురుకుల పాఠశాలకు ఇప్పటికే బెండికొండ వద్ద స్థలం కేటాయించామని నిధులు విడుదలైన వెంటనే పనులు చేపట్ట వచ్చన్నారు. అంతవరకు తాత్కాలిక వసతిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ గిరిరాజు, ఆర్ఐ పవిత్ర, టీడీపీ నాయకులు నాయకులు చాణక్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మెట్టూరు, బైపల్లి, చినవంక, చినకొత్తూరు, అమలపాడు తుఫాన్ రక్షిత భవనాలను ఆర్డీవో పరిశీలించారు.


గురుకులాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

ఆ స్థలం మాదే..

● చీపురుపల్లి రైతు కుటుంబం ఆవేదన

● ఆర్డీవో, డీఎస్పీలను కలిసి న్యాయం చేయాలని వేడుకోలు

పలాస, జూలై 22: ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మాణంలో తన భూమిని కోల్పోగా నష్టపరిహారం కోసం నాడు ప్రభుత్వంతో పోరాడాను.. ఆ పరిహారంతో కొనుగోలు చేసిన స్థలాన్ని కాపాడుకునేందుకు నేడు ఆక్రమణదారులతో పోరాటం చేయాల్సి వస్తోందని రైతు నందిగాం తాతారావు అనే రైతు కుటుంబం ఆవేదన వ్యక్తంచేసింది. న్యాయం చేయాలని కోరుతూ ఆర్డీవోను వేడుకున్నారు. ఈ ఘటన సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మితమవుతున్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మాణంలో మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామానికి చెందిన నందిగాం తాతారావుకు చెందిన పంట భూములను కోల్పోవాల్సి వచ్చింది. ఈ భూములకు నష్టపరి హారం కోసం నాటి ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్నారు. ఆ నగదుతో నర్సిపురంలో స్థలాన్ని కొనుగోలు చేసి కుటుంబ అవసరాలకు వినియోగించు కోవాలని భావించాడు.. అయితే ఆ స్థలాన్ని మరో వ్యక్తి ఆక్రమించాలని ప్రయత్నించాడు. ఆ స్థలం నా సొంతమని, న్యాయం చేయాలని తాతారావు పలాస ఆర్డీవో, డీఎస్పీలను కలిసి వేడుకున్నాడు. ఆయనతో పాటు అదే స్థలంలో మరో ఇద్దరు కూడా భూమిని కొనుగోలు చేసుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 15న చిన్నబడాంకి చెందిన కె.రామకృష్ణ, కె.ప్రసాద్, కె.గోవింద్‌తో పాటు మరో మహిళ తన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించినా దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. మా గ్రామానికి చెందిన పెద్దలను తీసుకొని వెళ్లినా అక్కడ తమకు చుక్కెదురైందని వాపోయారు. ఆర్డీవో భరత్‌నాయక్ కాళ్లపై పడి వేడుకున్నారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అలాగే కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డి వద్దకు బాధిత కుటుంబం వెళ్లి నేరుగా ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వీరి గోడు విని న్యాయం చేయాలని సీఐ విజయానంద్‌కు ఆదేశించారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు తాతారావు కుటుంబ సభ్యులు

ఆదమరిస్తే ప్రమాదమే..


వంశధార కుడికాలువ వంతెనపై రోడ్డు ఇలా..

హిరమండలం: హిరమండలం నుంచి పాతపట్నం వైపు వెళ్లే మార్గంలో సుభలయ గ్రామం వద్ద వంశధార కుడి కాలువపై ఉన్న వంతెన రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గొయ్యిలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. తక్షణం మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రోడ్డు బురదమయం

నందిగాం: దిగువ బీసీ కాలనీ రోడ్డు బురదమయంగా తయారైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ మీదుగానే ఎక్కువ శా తం మంది రాకపోకలు సాగి స్తుండడం, రోడ్డు దారుణంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


బీసీ కాలనీలో రహదారి

అధ్వానంగా ఇందిరా జంక్షన్

పలాస: స్థానిక ఇందిరా జంక్షన్ రహదారి ఇటీవల కురిసి న వర్షాలకు అధ్వానంగా మారింది. పలాస-గొప్పిలి గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ ప్రాంతంలో గత పదేళ్లుగా ఎటు వంటి నిర్వహణ లేకపోవడంతో రోడ్డంతా గోతులుగా తయారైంది. దీంతో ఏమార్షం కురిసినా గోతుల్లో నీరు చేరి రోజుల తరబడి ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతోంది.


దారుణంగా ఉన్న రోడ్డు

రోడ్లన్నీ గోతులమయం

వజ్రపుకొత్తూరు: సోమవారం రోజంతా కురిసిన వర్షానికి మండలంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఐదేళ్లుగా ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు లేకపోవడంతో గోతులు ఏర్పడి నీరు నిలిచిపోతోంది. దీంతో వాహన చోద కులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.


ధర్మపురం వద్ద రోడ్డుపై చేరిన వర్షపు నీరు

కాలువ కాదు.. రోడ్డే

చిత్రంలో చూస్తున్నారుగా.. ఇది కాలువ అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఇది ముక్తాపురం ప్రాథమిక పాఠశాల ఎదుటి రోడ్డు.. ఏ మాత్రం వర్షం కురిసినా ఇలా రోజుల తరబడి బురదనీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిందే.. సమస్యను అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే పరిస్థితి సోమవారం కూడా ఏర్పడింది. పాఠశాలకు నీటిలో నడిచి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రోజుల తరబడి నీరు నిలవడం వల్ల చర్మ సంబంధ వ్యాధులు సోకే ప్రమాదముందని, తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-మెళియాపుట్టి


పాఠశాల ఎదుట రోడ్డుపై నిలిచిన బురదనీరు

పిల్లలతో విద్యా సహాయక సామగ్రి తయారీ లక్ష్యం

● శిక్షా సప్తాహ్‌ను పరిశీలించిన ఉపవిద్యాశాఖాధికారి

టెక్కలి, జూలై 23: పాఠశాలల్లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో వివిధ అంశాల్లో పిల్లలతో విద్యా సహాయక సామగ్రి తయారీ, ప్రదర్శన చేయించడం లక్ష్యమని ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. సోమవారం ఆది ఆంధ్రావీధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శిక్షా సప్తాహ్ ప్రారంభ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ లక్ష్యాలను ఉపాధ్యాయులు నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.తులసీరావు, హెచ్‌ఎంలు నందికేశ్వరరావు, ఆట్ల రాహుల్, లోకేష్, యర్రయ్య, రాజా, సత్యం, అప్పారావు, సంక్షేమాధికారి సనీత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కార్పెట్‌ను అందిస్తున్న డిప్యూటీ డీఈవో విలియమ్స్

● **నందిగాం:** జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజు విద్యా ర్థులతో లో లోకాస్ట్, నోకాస్ట్ మెటీరియల్‌తో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ చార్ట్‌లు, ఫ్రూట్స్ మాస్కులు, భాషకు సంబంధించి షార్ట్‌లు తయారుచేయించి ప్రదర్శించారు. ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు పలు సూచనలు చేశారు. పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వివిధ చార్ట్‌లు, మాస్కులు ధరించి తోటి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు.

● **పాతపట్నం:** విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా బోధన ఉండాలని ఎంఈవోలు సీహెచ్ తిరుమల రావు, బి.శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా సోమవారం అభ్యసన సామగ్రి తయారీ, ప్రదర్శన చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరగతి వారీగా ప్రతి పాఠ్యాంశానికి చెందిన అభ్యాసన సామగ్రి తయారు చేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


బోధనా అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న దృశ్యం

● **మెళియాపుట్టి:** ప్రతి విద్యార్థి నూతన ఆలోచనలతో శాస్త్రవేత్తలను అనుసరించి బోధనా సామగ్రి తయారీకి ముందుకు రావాలని ఎంఈవోలు మల్లారెడ్డి పద్మనాభరావు, సవర దేవేంద్ర రావు అన్నారు. శిక్షా సప్తహ్‌లో భాగంగా జోడూరు, జాడిపల్లి, మెళియాపుట్టి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం బోధనా సామగ్రి మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, పొట్టన్న, కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

● **హిరమండలం:** శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు తయారు చేసిన బోధనా సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆలోచనలతో బోధనా సామగ్రిని తయారు చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

● **హరిపురం:** విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. భైరిసారంగపురంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు చెప్పారు. టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు విద్యాబోధనతో ఎంతో మేలు జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలు గుర్తించి హద్దులు నిర్ధారించాలి

తురకపేట(ఎల్.ఎన్.పేట): తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపల గెడ్డ ఆక్రమణలకు గురై నీరు వెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితి ఎదురైందని, ఆక్రమణలను గుర్తించి హద్దులను గుర్తించాలని తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజీ సర్వేయర్ అనురాధ, వీఆర్వో జోగినాయుడులకు ఆదేశించారు. సోమవారం కడపల గెడ్డ నీటి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. కడపలగెడ్డ ద్వారా వచ్చే నీరు దిగువన వంశధార నదిలోకి వెళ్లాల్సి ఉందని, అయితే రెండు వైపులా ఉన్న రైతులు గట్టును పంట పొలాల్లోకి కలుపుకోవడంతో గెడ్డ స్వరూపం కోల్పోయి బట్టిలా మారిందని పలువురు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వంశధార ఏఈ టి.శ్రీనివాసరావుతో మాట్లాడి కాలువ విస్తరణ పనులు చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. పలువురు రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాణిఅమ్మాజీ

ఒడిశా

ప్రజా వినతులకు భారీ స్పందన


ప్రజా సమస్యలను వింటున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగ సమితి పోత గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ప్రజా వినతుల కార్య క్రమాన్ని సోమవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు తరలివచ్చి పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. సామాజిక, విద్యా, ఆరోగ్య, నీటి సమస్యలు, రోడ్డు, ఇళ్ల నిర్మాణాలు, భూపట్టాలు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై ఫిర్యా దులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 127 ఫిర్యాదులు రాగా వాటిలో 10 అక్కడకక్కడే పరిష్కరించారు. ఒకరికి రెడ్‌క్రాస్ నిధుల నుంచి రూ.12 వేలు సాయాన్ని అందించారు. కార్యక్రమలో జిల్లా ఎస్పీ స్వాతి, జిల్లా పరిషత్ అభివృద్ధి కార్య నిర్వాహణాధికారి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

పర్లాకిమిడి: పట్టణంలోని 6వ వార్డు శివారులోని ప్రధాన కాలువను మాజీ ఎమ్మెల్యే సూర్యారావు, మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెట్టి, బీజేడీ నేత, హైటెక్ విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణి గ్రాహి మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాణిగ్రాహి మాట్లాడుతూ.. ఈ ప్రాంతం పట్టణానికి దిగువన ఉండడంతో కాలువ నీరు, చెత్త చెదారాలు ఈ ప్రాం తాల్లోకి చేరి దుర్గంధం వెదజల్లు తోందన్నారు. చెత్తతో పాటు నీరు మహేంద్ర తనయ నదిలో చేరడంతో సరిహద్దు ప్రాతంలో ఉన్న గోపాలపురం, పాతపట్నం ప్రజలు పలుమార్లు ఆదేదన వ్యక్తం చేశారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికార్లను కోరినా ఫలితం కనిపించలేదన్నారు. ఈ ప్రాంతంలో 10 లక్షల లీటర్ల కెపాసిటీ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రీసైక్లింగ్ యూనిట్లు నిర్మించాలని కోరారు. తద్వారా చెత్త నుంచిమంచినీరు వేరుచేసి పంట పొలాలు, మహేంద్ర తనయ నదిలో కలిసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న బీజేడీ నేతలు

సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి ఆత్మహత్య


పవన్‌కుమార్(ఫైల్)

ఎచ్చెర్ల: పొన్నాడ పంచాయతీ రాజీవ్ కాలనీకు చెందిన గురుగు పవన్‌కుమార్ (17) అనే విద్యార్థి తల్లిదండ్రులు సెల్ ఫోన్ ఇవ్వలేదని సోమవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. పవన్‌కుమార్ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. పవన్‌కుమార్ కళాశాలకు సక్రమంగా వెళ్లకుండా నిత్యమూ సెల్‌ఫోన్‌తో ఆడుకుని చదువును నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం తప్పిపోయాడు. అలాగే ద్వితీయ సంవత్సరం కూడా సక్రమంగా కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించి వారం రోజుల కిందట సెల్ ఫోన్ తీసుకున్నారు. అప్పటినుంచి కళాశాలకు వెళ్లకుండా ఇంటివద్దే ఉండిపోయాడు. తల్లిదండ్రులు నరసింహాచారి, సత్యవతి సోమవారం పనులకు వెళ్లిపోగా, చెల్లెలు అక్షయ పాఠశాలకు వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురై పవన్‌కుమార్ ఇంటిలో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఐటీఐ విద్యార్థి..


సాయికుమార్(ఫైల్)

ఎచ్చెర్ల: పొన్నాడ పంచాయతీ పంచిరెడ్డిపేటకు చెందిన చదువుల సాయికుమార్ (17) తల్లిదండ్రులు మందలించారన్న కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన తర్వాత సాయికుమార్ శ్రీకాకుళం నగరంలో ఓ ప్రైవేట్ ఐటీఐలో చేరాడు. క్లాసులకు సక్రమంగా వెళ్లక, సరిగా చదవకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో సాయికుమార్ ముద్దాడపేటలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చి.. ఈ నెల 12న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. తల్లి కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పంపు ఆపరేటర్ మృతి


అప్పలసూరి (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: పంపు రిపేర్ చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మరణించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, సచివాలయ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. సింగుపురం గ్రామ సచివాలయంలో మునసబుపేటకు చెందిన నగుడు అప్పలసూరి(42) 2016 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమం లో సోమవారం ఉదయంతో తోటి ఆపరేటర్ గుండ రామా రావుతో కలిసి మునసబుపేటలో ఉన్న ప్రభుత్వ పంపు షెడ్ పనిచేయకపోవడంతో మరమ్మతు చేసేందుకు వెళ్లారు. పంపు రిపేర్ చేస్తూ ప్యానల్ బోర్డు చెక్ చేస్తుండగా అప్పలసూరి విద్యుత్ షాక్‌కు గురై య్యాడు. వెంటనే రామారావు అతడిని రిమ్స్‌కు తీసుకెళ్లగా అప్పటికే అప్పలసూరి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పలసూరికి భార్య సావిత్రి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సావిత్రి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ..

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడి ఆనవాలు గుర్తుపట్టలేని విధంగా తల ఛిద్రమైందన్నారు. మృతుడి ఎడమచేతిపై అమ్మనాన్న అని రాసి ఉందని, నీలంరంగు షర్టు, నీలంరంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 94934 744582 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

పూణేలో రాపాకపుట్టుగ వాసి..


కృష్ణారావు(ఫైల్)

కవిటి: మండలంలోని రాపాకపుట్టుగ గ్రామానికి చెందిన మామిడి కృష్ణారావు(45) మహరాష్ట్రలోని పూణేలో మృతి చెందినట్టు సోమవారం కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వలసకూలీగా వెళ్లిన కృష్ణారావు అక్కడి ఓ పేపరు మిల్లులో కార్మికునిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి పూణేలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆకస్మాత్తుగా ఇంటివద్దనే పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా కృష్ణారావుకి భార్య మోహినితో పాటు పదేళ్లలోపు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితుడికి మూడు నెలల జైలు

నందిగాం: బోరుభద్ర గ్రామంలో 2018లో జరిగిన దాడి కేసులో నిందితుడికి మూడు నెలల పాటు జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ టెక్కలి జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్ఆర్ మల్లా తేజాచక్రవర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించి ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలస్వామి, పోలమ్మ భార్య భర్తలు. ఓ స్థల వివాదంలో వీరిపై అదే గ్రామానికి చెందిన ఇప్పిలి ఢిల్లేశ్వరరావు, లచ్చమ్మ, బొమ్మాళి హరి, సాయమ్మ, కమలమ్మ, లచ్చు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఢిల్లేశ్వరరావు దాడి చేసినట్టు రుజువు కావడంతో ఆయనకు జైలుశిక్షతోపాటు జరిమానా విధించగా, మిగిలిన ఐదుగురికి చెరో రూ.1000 చొప్పున్న ఫైన్ విధించారు. ఈ కేసును ఏపీపీ డి.హరిప్రియ వాదించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈఏపీ సెట్ తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ తుది కౌన్సెలింగ్ విడుదలైనట్టు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ జి.దామోదరరావు సోమవారం తెలిపారు. 'ఈ నెల 23 నుంచి 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేయాలి. 24 నుంచి 26వ తేదీలోగా కళాశాలలు, బ్రాంచ్‌ల కోసం ఆప్షన్లు నమోదు చేయాలి. తొలివిడత కౌన్సెలింగ్‌నకు హాజరైన విద్యార్థులు కూడా మెరుగైన కళాశాలలు, బ్రాంచ్‌ల కోసం మరోసారి ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 27న ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఉంది. సీట్ల కేటాయింపు వివరాలను ఈ నెల 30న కన్వీనర్ ప్రకటిస్తారు. తుది విడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల'ని దామోదరరావు సూచించారు.

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రిమ్స్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జడ్పీలో నిర్వహించిన మీ కోసంలో జాయింట్ కలెక్టర్ నవీన్‌కు తమ సమస్యలు వివరించి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం రిమ్స్ కార్మికులను ఆప్కాస్‌లో చేరుస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రైవేటు కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. రిమ్స్ ఆసుపత్రిలో సుమారుగా 600 మంది కార్మికులు శానిటేషన్, సెక్యూరిటీ, ఎస్‌టిపి, పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాల్లో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. గతంలో జరిగిన వేతన ఒప్పందాన్ని అమలు చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎన్నిసార్లు మా సమస్యలను కాంట్రాక్టరు దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని జేసీకి వివరించారు. సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రిమ్స్ నాయకులు రవి, ఎ.సావిత్రి, టి.కుమారి, జి.కృష్ణవేణి, ఐ.లక్ష్మి, జి.రామలక్ష్మి, కె.రమణమ్మ, మీనాకుమారి, బి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

జన్యుపరమైన వ్యాధులపై అప్రమత్తం అవసరం

గుజరాతీపేట: ప్రతి ఒక్కరూ జన్యుపరమైన వ్యాధులపై అప్రమత్తం అవసరమని రిటైర్డు గైనకాలజిస్ట్ కె.అరవింద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గ్రెగర్ మెండల్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రెగర్ మెండల్ పరిశోధనలు, వాటి ఆవశ్యకతను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, అధ్యాపకులు పి.హేమపద్మజ, సీహెచ్ కృష్ణారావు, ఎస్.పద్మావతి, టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న పంచాయతీ కార్యదర్శి బాధితులు


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

శ్రీకాకుళం క్రైం: నిరుద్యోగులమైన తమకు ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి రూ.లక్షల్లో కాజేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని, లేకుంటే సామూహిక ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించి తమ సమస్యను విన్నవించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మందస మండలం లోహరిబంద గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం నగర వాసి మన్నం సతీష్‌బాబు.. ప్రభుత్వ ఉద్యోగమిస్తామని రూ.లక్షల్లో వసూలు చేశాడని, తీరా తామంతా మోసపోయినట్టు గ్రహించి తామిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.13 లక్షలు, రూ.8 లక్షలు, రూ.12 లక్షలు, రూ.9 లక్షలు వసూలు చేశాడని బాధితులు కలెక్టర్‌కి విన్నవించుకున్నారు. పోలీసులను ఆశ్రయిస్తే తమ తప్పును అవహేలన చేస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిమ్మని సతీష్‌ను నిలదీస్తే రౌడీలను తీసుకొచ్చి, అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని వివరించారు. రూ.లక్షల్లో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆత్మహత్య ఒక్కటే గత్యంతరమని కన్నీటి పర్యంతం అయ్యారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. 14 రోజుల్లో న్యాయం చేస్తానని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని బాధితులకు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా గడిచిన ఏడాదిగా పంచాయతీ కార్యదర్శి బాధితులంతా ఏకమై ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశామని ప్రస్తుతం 70 మంది బాధితులు ఉన్నారని, వీరి నుంచి సుమారు రూ.13 కోట్లు తీసుకున్నట్టు బాధితులు తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినవారిలో సాయికృష్ణ, రాజబాబు, రాంబాబు, సంతోష్ తదితరులు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

కలెక్టరేట్: విభిన్న ప్రతిభావంతుల సమస్యలు తీర్చడానికి అవసరమైన సమగ్ర సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో డిగ్రీ, పీజీ చదువుతున్న ఎనిమిది మంది విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశామన్నారు. ఐటీఐ నుంచి పీజీ వరకు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులు ల్యాప్‌టాప్స్ కావాలంటే సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, శ్రీకాకుళం కార్యాలయానికి ఆన్‌లైన్‌లో గానీ, లేక నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, కార్యాలయ సిబ్బంది, విభిన్న ప్రతిభావంతులు వివిధ శాఖల అధికారులు తదితరలు పాల్గొన్నారు.

వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్: ఒడిశాలో భారీగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి నాగావళి, వంశధార నదులకు వచ్చి చేరుతున్న వరద నీటి ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జేసీ ఎం.నవీన్‌తో కలిసి తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నదీ ప్రవాహం ప్రమాద స్థాయిని దాటినట్లయితే గొట్టా బ్యారేజి వద్ద గేట్లను ఎత్తడానికి తగిన ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలి. ప్రధాన నదుల వరద నీటిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్ఎన్ పేట, తురకలకోట వద్ద కాజ్‌వే దెబ్బతినడంతో వంశధార నీరు 150 ఎకరాల్లో పంటను ముంచెత్తిందని, దీనిపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాలని వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్‌ను ఆదేశించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య పనులపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. ఉద్యానవన శాఖ, జిల్లా అటవీశాఖల అధికారులతో తాజా పరిస్థితిపై ఆరా తీశారు. సమీక్షలో డీఆర్వో ఎం.గణపతిరావు, పశుసంవర్ధక శాఖ జేడీ జయరాజు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, ఉద్యానవనశాఖ ఆర్‌వీ ప్రసాదరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సీపీవో ప్రసన్నలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

ఎచ్చెర్ల: స్థానిక పోలీసు క్వార్టర్స్‌లో గల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని పలు విభాగాల పనితీరు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏఆర్ పరిపాలన కార్యాలయంలోని ఆయుధ కారాగారం, మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ గదులు, గ్యాస్ గోదాం, వ్యాయామశాల తదితర విభాగాలను, రికార్డుల నిర్వాహణను పరిశీలించారు. పోలీసు జాగీలాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐలు సురేష్, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

గుజరాతీపేట: జైలులో ఉండే ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న అంపోలులోని జిల్లా జైలును సోమవారం సందర్శించిన ఆయన ఖైదీలకు అందుతున్న ఆహారం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్థిక స్తోమతలేని వారు దరఖాస్తు చేసుకుంటే వారి కేసును లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌కు అందించి ఉచితంగా కేసును నడిపిస్తామని తెలిపారు. జైలు సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

గుజరాతీపేట: లింగ నిర్ధారణ కోసం పరీక్షలు చేస్తే చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక వన్ స్టాప్ కేంద్రానికి, బాలసదన్, శిశు గృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగిన వారిపై చట్టరీత్యా శిక్ష అర్హులన్నారు. బాలసదన్, శిశు గృహకు వెళ్లి అక్కడ గల పరిస్థితులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, వైద్య సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ సూర్యకిరణ్

ఆమదాలవలస: బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేసేందుకు మండల సమాఖ్యలు అంకితభావంతో పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణాలు చెల్లించని సంఘాలను గుర్తించాలని కోరారు. స్త్రీనిధి ద్వారా అనుకున్న మేర రుణాలు అందించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమదాలవలస డీసీసీబీలో మాత్రమే 70 సంఘాలకు రుణాలు మంజూరు చేయడం, తిరిగి సక్రమంగా రీపేమెంట్ జరగడం రెండోసారి లింకేజీకు రెండీ ఉన్నారని, అదే విధంగా అన్ని గ్రామాల్లో కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీడ్ బ్యాంకు మేనేజర్ ఉమాశంకర్, యూనియన్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, స్టేట్‌బ్యాంక్ మేనేజర్ కిరణ్, ఏపీఎంలు పైడి కూర్మారావు, రవిరాజా, కమలకుమారి పాండియన్, రవికుమార్, సీఎఫ్ఎలు చిగురుపల్లి వెంకటేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాట్య మయూరి అవార్డుకు ఎంపిక


అవార్డుకు ఎంపికైన నృత్యకారిణులు

ఇచ్ఛాపురం: ఆల్ ఇండియా లెవెల్ జూనియర్ డ్యాన్స్ కూచిపూడి నాట్యానికి పట్టణానికి చెందిన స్వేచ్ఛా నృత్య తరంగిణి చిన్నారులు నాట్య మయూరి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు 24న నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ వారి ఆద్వర్యంలో సిరా ఆర్ట్ అకాడమీ నిర్వహణలో బోనాల ఉత్సవాలు సందర్భంగా ఆల్ ఇండియా లెవల్ డ్యాన్స్ ప్రోగ్రాం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు నాట్య ప్రదర్శనతో పాటు అవార్డులను అందుకుంటారని అకాడమి అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. జూన్‌లో ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల కూచిపూడి ప్రదర్శనల వీడియోను పంపించామన్నారు. దానిలో ఎంపిక చేసి గ్రూప్‌నకు నాట్య మయూరి అవార్డుకు ఎంపిక చేశారన్నారు. అవార్డుకు యశ్విత, శరణ్య, సంజన, భూమిక, లావణ్య, అనుశ్రీ ఎంపికయ్యారని తెలిపారు. 24న నాట్య ప్రదర్శనలు పాల్గొని అవార్డులు అందుకుంటారన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

రణస్థలం: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి అన్నారు. సోమవారం ఎంఆర్‌సీని ఆమె సందర్శించారు. పాఠశాలలు మారినప్పుడు విద్యార్థుల పేర్లు అప్‌డేట్ చేయాల సిబ్బందికి సూచించారు.

ఇబ్బందులు తొలగించాలి


ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం బృందం

సోంపేట: పైడిగాం ప్రాజెక్టు ఆధునీకరణ కోసం రూ.17కోట్లను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కోరారు. పైడిగాం ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు ఆయకట్టు ఐదు వేల ఎకరాలు సాగు కాగా, ఆధునీకరణ చేపడితే మరో ఏడు వేల ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అందువల్ల పూర్తిస్థాయిలో ప్రభుత్వం నిధులు కేటాంచాలని కోరారు. ఈ పర్యటనలో కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు, కె.నాగమణి, సంగారు లక్ష్మీనారాయణ, జయరాం తదితరులు ఉన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

సరుబుజ్జిలి: ఇసకలపాలెం, కొండవలస గ్రామాల్లో ముంపు ప్రాంతాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సీహెచ్ బాలకృష్ణ, ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు బారిన పంటను ఎలా సంరక్షించుకోవాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటమునిగిన నారుమడుల నుంచి బయటకు తీసి కార్బనిజంను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో రైతులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల బృందం పర్యటన

గార: ఇటీవల కురిసిన వర్షానికి అంపోలు దగ్గరలో నీటమునిగిన వరి ఎద పంటనలు మంగళవారం ఉదయం వ్యవసాయ శాస్త్రవేత్తలు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు వారికి అవగాహన కల్పించారు. పర్యటనలో ఎమ్మెల్యే శంకర్ సతీమణి స్వాతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బగ్గు రజని, ఏవో దుంపల పద్మావతి, వీఏఏలు పాల్గొన్నారు.

పశువుల పరిరక్షణ అందరి బాధ్యత

బూర్జ: పాడి పశువుల పరిరక్షణ మనందరి బాధ్యత అని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. ఓవీ పేట గ్రామంలో జరిగిన పాడి పశువులకు వ్యాక్సిన్ల వేసే కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధికి సంబంధించిన వ్యాక్సిన్లు వేశారు. ఈ వ్యాక్సిన్ ఓవీ పేట లైవ్‌స్టాక్ యూనిట్‌లో అందుబాటులో ఉందన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి ఆల్ ఇండియా నృత్య పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ (విశాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఆల్ ఇండియా నృత్య పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న సంప్రదాయ నృత్య కళాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో దేశభక్తి అంశంతో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యంశాల్లో డ్యూయేట్, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలను ఉంటాయన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఫైనల్స్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలతోపాటు ట్రోఫీ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో 10 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు వారిని జూనియర్స్‌గాను, 16 ఏళ్లు పైబడిన వారిని సీనియర్స్‌గాను పరిగణిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, నృత్యాలయాలు, సాంస్కృతిక సంస్థలకు చెందిన కళాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినవారు విశాఖలో జరిగే గ్రాండ్ ఫైనల్స్ (ఆఫ్‌లైన్)లో పాల్గొంటారన్నారు. ఈ వేడుకలో గ్రాండ్ ఫైనల్స్ విజేతలకు వికసిత్ భారత్ నృత్య ట్రోఫీ 2024లతో పాటు నగదు ప్రోత్సాహకాలను ప్రముఖుల చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు 85229 90123 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

వంతెనకు వాల్ నిర్మించండి


పొలాల్లోకి జారిపోతున్న గ్రావెల్

ఇచ్ఛాపురం: అరకభద్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన బహుదా నదిపై వంతెన నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు వేస్తున్నారు. అయితే బ్రిడ్జికు వాల్ నిర్మించకపోవడంతో గ్రావెల్ అంతా జారి పొలాల్లోకి వెళ్లిపోతుంది. దీంతో పంటలు నాశనం అవుతున్నాయి, అందువల్ల రోడ్డు పనులు జరగకుండానే వంతెనకు వాల్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. పొలాల్లోకి చేరిన గ్రావెల్‌ను తొలగించాలని అనేకసార్లు కాంట్రాక్టర్‌కు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ఇంజనీరింగ్ అధికారులు స్పందించి రైతులకు ఆదుకోవాలని సంబంధిత రైతులు బింగి లక్ష్మమ్మ కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం: మూగ జీవాలకు ప్రబలుతున్న లంపీ స్కిన్ వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్ అన్నారు. సోమవారం జి.సిగడాం, టీడీ వలస, గొబ్బూరు గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సూర్యనారాయణ, బి.శంకరరావు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

20 మంది ఎస్ఐలకు బదిలీ

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో పనిచేస్తున్న 20 మంది ఎస్ఐలకు ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన ఎస్ఐలతో సహా విశాఖ రేంజ్ పరిధిలో మొత్తం 53 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా నుంచి 20 మంది ఎస్ఐలు బదిలీ కాగా, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 20 మంది ఎస్ఐలు శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై రానున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సృజనాత్మకత వెలికితీయాలి

కంచిలి: స్థానిక వనరులను వినియోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతక వెలికితీయాలని ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, చిట్టిబాబు అన్నారు. జాడుపూడి ఎంపీయూపీ స్కూల్‌లో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగ మొదటి రోజు (టీఎల్ఎం)స్థానిక వనరులతో బోధన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. బూరగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సోమేశ్వరరావు విద్యార్థులతో ఖాళీ కప్పులతో హిందీ వర్ణమాలను తయారు చేయించారు.

కొళిగాంలో విద్యావారోత్సవాలు

ఇచ్ఛాపురం: విద్యా వారోత్సవాల్లో భాగంగా కొళిగాం జడ్పీ హైస్కూల్ శిక్షా సప్తాహ (ఎడ్యుకేషన్ వీక్) కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన టీఎల్ఎం ఎగ్జిబిషన్ ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. 23న ఎఫ్ఎల్ డే, 24న స్పోర్ట్స్ డే, 25న కల్చరల్ డే, 26న స్కిల్స్ అండ్ డిజిటల్ ఇన్నిటేషన్ డే, 27న న్యూట్రిషన్ డే, 28న ఇన్విరాన్‌మెంట్ డే నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

ఇచ్ఛాపురం: సచివాలయాల్లో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ డ్రైవ్ (బయోమెట్రిక్ అప్‌డేషన్) చేపట్టనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ సోవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 23న మంగళవారం బెల్లుపడ కాలనీ-3, కార్తీవీధి, 24న మంగళవారంపేట, బెల్లుపడ కాలనీ-1, 25న తురకవీధి, 25న రత్తకన్న, 27న ఫకీర్‌పేట సచివాలయాల పరిధిలో డ్రైవ్ ఉంటుందని, అవసరమైనవారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- **కంచిలి:** కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ మొబైల్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచిలి హైస్కూల్, ఎంఎస్ పల్లి హైస్కూల్‌లో ఈకేంద్రాలు అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు.
- **జి.సిగడాం:** మండలంలో పలు సచివాలయాల పరిధిలో నేటి నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న మొబైల్ ఆధార్ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. జి.సిగడాం, నడిమివలస, వెలగాడల్లో 23 నుంచి 27 వరకు, బాతువ, ఆనందపురంలో 23 నుంచి 25, గెడ్డకంచరాం, వాండ్రంగిలో 26 నుంచి 27 వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.
- **పొందూరు:** ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహి ంచనున్న ఆధార్‌డ్రైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ కోరారు. ఆధార్ డ్రైవ్ విజయవంతం చేయడానికి ఎంపీడీవో సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23న నందివాడ, గోకర్ణపల్లి, కొంచాడ, వీఆర్ గూడెం, అచ్చిపోలవలస సచివాలయాల్లో, 24న బి.కంచరాం, గోరింట, మలకాం, కోటిపల్లి, తోలాపి, 25న కృష్ణాపురం, లైదాం, తండ్యాం, ధర్మపురం, తోలాపి, 26న దళ్లిపేట, తాడివలస, పొందూరు, దళ్లవలస, కింతలి, 27న బాణాం, మొదలవలస, పొందూరు, రాపాక-1 కనిమెట్ట సచివాలయాలలో ఉచితంగా ఆధార్‌సేవలు అందిస్తారని తెలిపారు.

సరైన ప్రణాళికతోనే ఉజ్వల భవిత

ఎచ్చెర్ల: సరైన ప్రణాళికతోనే ఉజ్వల భవిత ఉంటుందని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పబ్లిక్ అండ్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొగిరి సుగుణాకరరావు అన్నారు. చిలకపాలెంలో గల ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులు నాలుగేళ్లపాటు శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని సునాయసంగా సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీ జీవీ రమణమూర్తి, యాజమాన్యం ప్రతినిధులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కేసులు పెట్టినా భయపడేది లేదు

ఆమదాలవలస: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం తనతో పాటు వైసీపీ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. శాంతిభద్రతలపై చర్యలు తీసుకోలేని హోంమంత్రి తిరిగి దబాయించడం విడ్డూరంగా ఉందన్నారు. 45 రోజుల్లో రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు పెట్టిన ఈ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే స్థితిలో లేకపోవడం శోచనీయమన్నారు. 2019లో రూ.100 కోట్లతో వైసీపీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత సాధించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హత్యలు, దాడులు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, దుంపల శ్యామ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

శివాలయంలోకి కొండచిలువ



కవిటి: రాజపురం గ్రామంలోని కొండపైనున్న శివాలయంలోకి కొండచిలువ దూరింది. శివాలయంలోని ముందుభాగంలో కొండచిలువ వెళ్లి చుట్టుకొని ఉండిపోయింది. సోమవారం కావడంతో లోపలికి వెళ్లేందుకు పూజారి, భక్తులు ప్రయత్నించడంతో మధ్యలో పాము కనిపించడంతో ఒక్కసారిగా భయపడ్డారు. ఈ శివాలయం కొండలోని గుహ మాదిరిగా ఉండడంతో లోపలికి వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. గ్రామస్థులు పామును బయటకు పంపించేందుకు ప్రయత్నించినా ఫలితంలేకపోవడంతో విడిచిపెట్టేశారు. చాలా పెద్ద పాముగా ఉంటుందని చుట్టుకొని ఉండటంతో పొడవు ఎంతమేర ఉంటుందోనని గ్రామస్థులు చెబుతున్నారు.

రైతులను ఆదుకోండి

ఇచ్ఛాపురం: రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ బోర పుష్ప కోరారు. ఈమేరకు సోమవారం ఏవో బార్గవికి వినతి పత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా ఇవ్వలేదని వెంటనే అందేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, బి.జగన్, కారంగి మోహనరావు, త్రినాద్, సీహెచ్ దేవరాజ్, నూకయ్యరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

రణస్థలం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు రావాడ పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జనార్దన్‌నాయుడు అన్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, వైద్య సిబ్బంది రమేష్, రేవతి పాల్గొన్నారు.